క్లుప్తంగా

హరీశ్‌రావును కలిసిన నాగజ్యోతి


హరీష్‌రావుతో నాగజ్యోతి

ములుగు రూరల్: మాజీ ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావును బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి హైదరాబాద్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ములుగు జిల్లాలో చోటు చేసుకున్న సంఘటనపై చర్చించారు. ఆమె వెంట రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

చేయూత


ఆర్థికసాయం అందిస్తున్న డీఎస్పీ రవీందర్

వెంకటాపురం(ఎం): మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన నిరుపేద మహిళ ఎండీ.రజియాకు డీఎస్పీ రవీందర్, ఎస్సై చల్ల రాజు చేయూతనందించారు. ఇటీవల రజియా కుమారుడు చాంద్‌పాషా ఆత్మహత్య చేసుకోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. విషయం తెలుసుకున్న వారు ఆమె ఇంటివద్దకు వెళ్లి 50 కిలోల బియ్యంతో పాటు రెండు వేల ఆర్థికసాయాన్ని అందించారు.

ఇసుక ర్యాంపుల తనిఖీ


తనిఖీ చేస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ సమీపంలోని ఇసుక ర్యాంపులను తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్సై కొప్పుల తిరుపతిరావులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇసుక రీచ్‌లో లోడింగ్, పార్కింగ్ స్థలంపై విచారణ చేశారు. రోడ్డుపై ఇసుక లారీలను నిలుపొద్దని సొసైటీ సభ్యులకు, ఇసుక రీచ్ నిర్వాహకులకు సూచించారు.

అక్రమ వసూళ్లపై విచారణ


విచారణ చేస్తున్న అధికారులు

మంగపేట: మండలంలోని మల్లూరు ఇసుక క్వారీలో ఇసుక లోడింగ్ అక్రమంగా వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలపై తహసీల్దార్ రవీందర్, ఎస్సై సురేష్ సమక్షంలో శుక్రవారం విచారణ నిర్వహించారు. డీడీలతో వచ్చే లారీలలో ఇసుక లోడింగ్ చేయాలి తప్ప డబ్బులు వసూలు చేయొద్దని చేస్తే కేసునమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు. కాగా తమ విచారణలో వెల్లడైన విషయాన్ని కలెక్టర్, ఎస్పీకి నివేదిక పంపిస్తామన్నారు.

స్పోర్ట్స్ మెటీరియల్ అందజేత


స్పోర్ట్స్ మెటీరియల్ అందిస్తున్న సభ్యులు

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మెటీరియల్ అందజేశారు. ఈ మేరకు శుక్రవారం లయన్ క్లబ్ అధ్యక్షుడు దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్ రమణారెడ్డి సహకారంతో విద్యార్థులకు ఆట సామగ్రితో పాటు ఇంగ్లీష్ గ్రామర్ బుక్స్, డిక్షనరీలు అందించామని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి చుంచు రమేష్, సానికొమ్ము రవీందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ, పీఈటీ లవనిక, పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో కనీస వసతులు లేకుండా వైద్యం అందిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులపై చర్య తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు రొంటాల భిక్షపతి కోరారు. ఈమేరకు శుక్రవారం జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కనీస వసతులు లేకుండా వైద్యం అందిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల బాలికకు ఆ ఆస్పత్రి వైద్యులు చికిత్స అందించగా మూడు రోజుల తరువాత మృతి చెందిందని అన్నారు. ఇటీవల మహిళకు ఆపరేషన్ నిర్వహించగా వైద్యం వికటించి హైద్రాబాద్ ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉందని అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రధానరోడ్డుపై గుంతలు


కోమటిపల్లి క్రాస్ రోడ్డు వద్ద ప్రధాన రోడ్డుపై ఉన్న గుంతలు


మల్లూరు బస్టాప్ వద్ద రోడ్డుపై నిలిచి ఉంటున్న వర్షపు నీరు

- నిలుస్తున్న వర్షపు నీరు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

మంగపేట: మండలంలోని ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా తయారైంది. పర్యవేక్షించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు కేవలం కార్యాలయాలకు మాత్రమే పరిమితం కావడంతో రోడ్డును మరమ్మతు చేసే వారే కరువయ్యారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లా సరిహద్దు గ్రామం బ్రాహ్మణపల్లి నుంచి కమలాపురం వరకు ప్రధాన రోడ్డు ప్రమాదాలకు నిలయంగా తయారైందని వాపోతున్నారు. ప్రధాన రోడ్డుపై బ్రాహ్మణపల్లి, రమణక్కపేట, వాడగూడెం, పాలాయిగూడెం, చుంచులపల్లి, మల్లూరు, బోరునర్సాపురం, మంగపేట, గంపోనిగూడెం, కమలాపురం తదితర ప్రాంతాలో ప్రధాన రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మల్లూరు బస్టాప్, బరోనర్సాపురం, మంగపేటలోని పెట్రోలు బంకు వద్ద ప్రధాన రోడ్డుపై గుంతల్లో వర్షపు నీరు నిలిచి ఉంటుంది. దీంతో గుంతలు కనిపించక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నిత్యం వందలాది లారీలు, ఆర్టీసీ బస్సులు ఇతర ప్రైవేటు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రోడ్డును పర్యవేక్షించాల్సిన అధికారులు తమకేమీ సంబంధం లేనట్లుగా వ్యవహరించడంపై ప్రజలు మండిపడుతున్నారు. వెంటనే సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలతో పాటు రోడ్డుపై నిలిచి ఉంటున్న నీటిని తొలిగించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

గోదావరి వరద ఉధృతి పరిశీలన


వరద ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు

మంగపేట: మండలంలో గోదావరి వరద ఉధృతి పెరుగుతుండటంతో మండల కేంద్రంలోని పొదుమూరు, కమలాపురం ఇంటెక్‌వెల్ వద్ద వరద ఉధృతిని తహసీల్దార్ రవీందర్ శుక్రవారం పరిశీలించారు. గోదావరి ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆయా ప్రాంతాల నుంచి వచ్చే వరదలతో గత రెండు రోజుల నుంచి గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ముంపు ప్రాంతాలయిన పొదుమూరు, దేవనగరం, కత్తిగూడెం, అకినేపల్లి మల్లారం లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయా పంచాయతీల కార్యదర్శులను ఆదేశించారు.

ఎరువుల ధరలు తగ్గించాలి


వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

ములుగు రూరల్: ప్రభుత్వం పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అమ్జద్‌పాషా అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రైతులకు అవసరయ్యే యూరియాను అందుబాటులో ఉంచాలని అన్నారు. ప్రైవేటు వ్యాపారులు యూరియా అధిక రేటుకు విక్రయిస్తున్నారని చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫర్టిలైజర్ షాపుల్లో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. బిల్లు లేకుండా యూరియా బస్తాను రూ.300 నుంచి రూ.350కి విక్రయిస్తు రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. నారాయణసింగ్, మహేందర్, సర్వయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


ఎస్ఎస్ తాడ్వాయి: పరామర్శిస్తున్న మంత్రి సీతక్క


ఏటూరునాగారం: పరామర్శిస్తున్న కవిత

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని తాడ్వాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొని మధు, వెంకన్న తండ్రి గొని అంజయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మంత్రి సీతక్క శుక్రవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. మంత్రి వెంట మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ ముజఫర్‌హుస్సేన్, పీఏసీఎస్ డైరెక్టర్ యానాల సిద్దిరెడ్డి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రాంబాబు ఉన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎండీ.వలిబాబా తండ్రి ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోతు కవిత శుక్రవారం పరామర్శించారు. అనంతరం మలిదశ ఉద్యమనాయకుడు డాక్టర విద్యాసాగర్‌ను కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆమె వెంట నాయకులు సునీల్‌కుమార్, మల్లారెడ్డి, ఖాజా, రఘు, రాంన్సయ్య, నర్సయ్య, బోజారావు, చంద్రబాబు, పుల్లయ్య, ఖలీల్, ముత్తయ్య, చంద్రం, లక్ష్మణ్, బట్టు రమేష్ పాల్గొన్నారు.

టేకు దుంగల పట్టివేత


స్వాధీనం చేసుకున్న టేకు దిమ్మెలు

వెంకటాపురం(కె): బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను రేంజర్ వంశీ కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం అటవీ శాఖ సిబ్బంది పట్టుకున్నారు. మండల పరిధిలోని సూరవీడు వద్ద ఏనిమిది టేకు దిమ్మెలను బొలేరో వాహనం స్వాధీనం చేసుకున్నారు. టేకు దిమ్మల విలువ సుమారుగా రూ.2 లక్షల వరకు ఉంటుందని రేంజర్ తెలిపారు.

జనాభా నియంత్రణే శ్రేయస్కరం


బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్

ఏటూరునాగారం: జనాభా నియంత్రణే మనకు శ్రేయస్కరమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం మేర యువ భారత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్‌పోటీలను నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జనాభా పెరిగే కొద్ది సవాళ్లు పెరుగుతాయని వనరుల కొరత ఏర్పడడం, నిరుద్యోగ సమస్య పెరుగుతుందన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మామిడి శంకర్, భిక్షపతి, రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రవిచంద్ర, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కిషోర్, రవితేజలతోపాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

ములుగు రూరల్: గంజాయి రవణా చేస్తూ ఒకరు పట్టుబడిన సంఘటన గట్టమ్మ ఆలయ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం గట్టమ్మ ఆలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న భూపాలపల్లి జిల్లా రేగొండ గ్రామానికి చెందిన ఒ మైనర్ పోలీసులను గమనించి వాహనం తిప్పుకొని వెళ్తుండగా అనుమానంతో వాహనాన్ని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా కేజీ ఎండు గంజాయి లభించింది. ఇద్దరు పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి పట్టుబడిన గంజాయి, యువకుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన వ్యక్తి మైనర్ కావడంతో జువనైల్ హోమ్‌కు తరలించామని అన్నారు.

వసతులు కల్పించడంలో విఫలం

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి


మాట్లాడుతున్న రవి

ఏటూరునాగారం: ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికి వదిలేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్యక్షుడు జాగటి రవితేజ, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వానల కారణంగా పాఠశాలలంతా బురద గుంటలుగా మారాయని విమర్శించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన చార్జీలను పెంచి నాణ్యమైన భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాదు రాకేష్, బాలు, జిల్లా కమిటీ సభ్యులు బట్ట స్వామి, కుమ్మరి నర్సింహ రావు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో చోరీ

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం శివాలయంలో శుక్రవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. ఆలయం ప్రధాన ద్వారానికి తాళం వేసి ఉండగా దానిని పగులగొట్టి గ్రిల్స్‌ను తెరిచి ఆలయంలో ఉన్న హుండీని గుడికి సుమారు వంద మీటర్ల దూరంలో తీసుకెళ్లి అందులో నగదు తీసుకుని కరకట్టపై పడేసి వెళ్లారు. హుండీలో సుమారు రూ.7వేల వరకు నగదు ఉండవచ్చవని ఆలయ చైర్మన్ ఎగ్గడి కోటయ్య తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్ సిబ్బందితో వచ్చి ఆలయాన్ని పరిశీలించి దొంగతనం జరిగిన తీరును తెలుసుకున్నారు.

కల్వర్టు, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి


మాట్లాడుతున్న సతీష్

వెంకటాపురం(కె): మండల పరిధిలోని కలిపాక గ్రామం నుంచి పెంకవాగు వరకు రోడ్డు నిర్మాణం, కల్వర్టుని నిర్మించాలని ఆదివాసీ సక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ డిమాండ్ చేశారు. కలిపాక గ్రామంలో శుక్రవారం సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెంక వాగు నుంచి కలిపాక వరకు రోడ్డు లేక పోవడంతో ఉపాధ్యాయులు రావడం లేదన్నారు. దీంతో ఆదివాసీ విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారన్నారు. కలిపాక గ్రామస్తులు అనారోగ్యానికి గురైతే చుట్టు వాగు ఉండడంతో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణంతో పాటు కల్వర్టును నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తాటి రాంబాబు, రమేష్, రామక్క, బాలమ్మ, మల్లేశ్, ప్రియాంక, పూర్ణ, ఆనంద్ ఉన్నారు.

మహిళా శక్తి సంబురాలపై కళా ప్రదర్శన


కళాప్రదర్శన ఇస్తున్న కళాకారులు

వెంకటాపురం(ఎం): ఇందిర మహిళా శక్తి సంబురాల్లో భాగంగా మండలంలోని లక్ష్మీదేవిపేటలో తెలంగాణ సాంస్కృతిక సారధి బోడ కిషన్ ఆధ్వర్యంలో కళాప్రదర్శన నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, గృహజ్యోతి, ఇందిర మహిళా క్యాంటీన్ పథకాలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కళాకారులు పాటల రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అయిలయ్య, కళాకారులు మార్త రవి, రాగుల శంకర్, విజయ్, బుచ్చన్న, నరేష్, తిరుపతి, సురేష్, రాజేందర్, శోభ తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణకు చర్యలు


విద్యార్థులకు వివరిస్తున్న మాధవిశీతల్

గోవిందరావుపేట: అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పస్రా రేంజ్ అధికారి మాధవిశీతల్ పేర్కొన్నారు. శుక్రవారం గోవిందరావుపేట మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అటవీ ప్రాముఖ్యతను, అటవీ జంతువులు, వాటి ఆవాసాల గూర్చి విద్యార్థులకు డాక్యుమెంటరీ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దివాకర్, ఎఫ్ఎస్ఓ వేణుగోపాల్, బీట్ ఆఫీసర్స్ దీప్ లాల్, అర్జున్‌రెడ్డి, రమేష్, మౌనిక, శారద, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ తల్లికి చీరసారెల సమర్పణ


అమ్మవారికి చీరసారెను సమర్పిస్తున్న మహిళలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో కొలువై ఉన్న దుర్గాదేవికి ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం భక్తులు చీరసారెలు సమర్పించారు. ముందుగ రామాలయం నుంచి మహిళలు పెద్ద ఎత్తున బొడ్రాయి వద్దకు చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వర్‌రావు శర్మ బొడ్రాయి తల్లికి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అక్కడి నుంచి తిరిగి మహిళలు డప్పు చప్పుళ్లతో పూనకాలతో రామాలయానికి ఊరేగింపుగా వచ్చారు. మహిళలు తెచ్చిన 101 రకాల నైవేద్యాలను దుర్గమ్మ తల్లికి సమర్పించారు. ఆషాఢ మాసంలో విష్ణుమూర్తి నిద్రాసేవలోకి ఉంటారని అందుకే ఈ మాసానికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అర్చకులు భక్తులకు అవగాహన కల్పించారు. ఆలయ చైర్మన్ అలువాల శ్రీనివాస్, చిత్తు బొత్తుల సదానందం, ఇర్సవడ్ల సంతోష్, సప్పిడి రాము, ఇర్సవడ్ల విశాల్, గడదాసు శివ, శశిధర్, నకిరబోయిన రమేష్, వీరాచారి, సంతోష్, నూతి రమేష్, క్యాత యాదగిరితో పాటు దుర్గామాత కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్ల పెంపు హర్షణీయం

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవేందర్


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచడం హర్షించదగిన విషయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచడంతో గురువారం మేడారంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు రిజర్వేషన్ల పెంపు చారిత్రాత్మక నిర్ణయమన్నారు. బీసీల రాజకీయ ఎదుగుదల కోసం ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశంలోనే సంచలన నిర్ణయమన్నారు. బీసీలకు న్యాయం చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ మండల అధ్యక్షుడు యాశాడపు మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, నాయకులు భూషనబోయిన రవికుమార్, పాక రాజేందర్, మాజీ సర్పంచ్ సునీల్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న విక్రాంత్

వాజేడు: కాంగ్రెస్ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ అన్నారు. మండల పరిధిలోని ఏడ్జెర్లపల్లి గ్రామంలో శుక్రవారం యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో విక్రాంత్ పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరు కష్టపడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మాజీ సర్పంచ్ తల్లడి ఆదినారాయణ, అంకెన బోయిన నర్సింహరావు, చెన్నం సరబాబు, చెన్నం మోహన్ రావు, గ్రామ కమిటీ సభ్యులు బట్ట శ్రీకాంత్, కొండ గొర్ల వెంకటేష్, నవీన్, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ అభినవ్


ఏటూరునాగారం: నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

కన్నాయిగూడెం: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అభినవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తుపాకులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గుట్టలగంగారంలో స్థానిక వైద్యులు అభినవ్ సిబ్బందితో కలిసి వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామంలో ఉన్న ఆర్ఎంపీ సెంటర్‌ను తనిఖీ చేశారు. పరిమితికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డీపీఎంఓ సంజీవరావు, హెచ్‌ఈ సుజాత హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఫ్రైడేను డ్రైడేగా పాటించాలి

ఏటూరునాగారం: ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని, పాడైపోయిన వస్తువులను బయట పడవేయాలని మాత శిశు సంరక్షణ సంచార వైద్యుడు నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని రొయ్యూర్ గ్రామంలో ఇంటింటా తిరుగుతూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి పాడైపోయిన వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి 72మందికి పరీక్షలు చేశారు. 9 మంది జ్వరపీడితులుండగా వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఖలీల్, హెల్త్ అసిస్టెంట్ నగేష్, ఏఎన్ఎం పావని, ఆశ కార్యకర్తలు రాజ్యలక్ష్మీ, రమాదేవి పాల్గొన్నారు.

అరుణాచలపురంలో వైద్యశిబిరం

వాజేడు: మండల పరిధిలోని అరుణాచలపురంలో వాజేడు వైద్యాధికారి కొమరం మహేందర్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులను అందించారు. అనంతరం ఘణపురం గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి ప్రత్యేకంగా జ్వరాలతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. జ్వరాలతో బాధపడుతున్న వారి ఇంటి పరిసరాల్లో పైరిత్రిన్ మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట హెల్త్ సూపర్ వైజర్ కోటిరెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు, శేఖర్, సత్య నాగవేణి, పంచాయతీ సెక్రెటరీ కార్తీక్, తదితరులు ఉన్నారు.